క్లుప్తంగా

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


మృతి చెందిన నరేందర్(ఫైల్)

శాయంపేట : మద్యానికి బానిసైన యువకుడు తల్లిదండ్రులను డబ్బులు అడుగగా వారు నిరాకరించడంతో గడ్డి మందుతాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన శాయంపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన బగ్గి నరేందర్ (20) మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు ఇవ్వాలని తరచు తల్లిదండ్రులను వేధించేవాడు. తండ్రి రాజయ్య మందలించినప్పటికీ అతనిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన తండ్రి రాజయ్య పోచమ్మ బోనాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా కుమారుడు నరేందర్ రూ. 2 వేలు ఇవ్వాలని మళ్లీ వేధించడం మొదలు పెట్టాడు. దీంతో తండ్రి బోనాలు సమర్పించాక ఇస్తానని నచ్చజెప్పి పోచమ్మ ఆలయానికి వెళ్లిపోయారు. మొక్కులు సమర్పించుకొని ఇంటికి వచ్చారు. ఇంతలోనే నరేందర్ ఇంటి ముందు నురగలు కక్కుతూ కనిపించాడు. ఏమైందని తల్లిదండ్రులు ప్రశ్నించగా ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి నరేందర్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

లోక్అదాలత్‌లో 123 కేసులు పరిష్కారం

శాయంపేట : పరకాల జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని 123 కేసులు పరిష్కారం అయినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. వివిధ నేరాలు, గొడవలు, భూములు, యాక్సిడెంట్, ఈ–పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మొత్తంగా 123 కేసులు రాజీ పడినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా..

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి మద్దతుగా ఉంటూ మరోసారి గెలిపిస్తామని మండలంలోని గోవిందాపూర్ యువకులు శనివారం తీర్మానం చేసినట్లు సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో జీఎంఆర్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే రమణారెడ్డి భూపాలపల్లి జిల్లా కేంద్రంలో యువతకు ఉచిత కోచింగ్ ఇప్పించారని గుర్తుచేశారు. ఉచిత శిక్షణతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించి యువతకు బాసటగా నిలిచారని అన్నారు. ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్న జీఎంఆర్ ట్రస్ట్ సేవలను గుర్తించి గ్రామ యువత ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి రాబోయే ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు ఉదారి మహేష్, మోహన్ రావు, ప్రశాంత్, అశోక్, రాజు, సదానందం, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వాలి

శాయంపేట : మండలంలోని అర్హులందరికీ దళితబంధు మంజూరు చేయాలని సీపీఐ మండల నాయకుడు బత్తిని సదానందం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే దళితబంధు వస్తుందని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం అందిస్తున్న దళితబంధు, బీసీ కార్పొరేషన్ రుణాలను పార్టీలతో సబంధం లేకుండా అర్హులకే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, భద్రయ్య, రమేష్, సాంబయ్య, రాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం..



శాయంపేట : మండలంలోని మాందారిపేట కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల ఎదుట గల జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో గుడిసె వాసులు శనివారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేశారు. గుడిసె వాసులు క్రాంతికుమార్, భద్రయ్య, సాంబయ్య, రమేష్‌ను వాహనదారులు అభినందించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు లలితకు ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికై ప్రశంసపత్రం అందుకున్న విషయం తెలిసిందే. శనివారం ఆమెకు పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు.

ఘనంగా 'కాళోజీ' జయంతి

- అక్షర యోధుడి చిత్రపటానికి పలువురి నివాళి
- జిల్లా వ్యాప్తంగా కాళోజీ జయంతి ఉత్సవాలు


శాయంపేటలో..


ఆత్మకూరులో..


ధర్మసాగర్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


ఎల్కతుర్తి: భీమదేవరపల్లిలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ఐనవోలులో..


ధర్మసాగర్: వేలేరు మండల కేంద్రంలో..


కమలాపూర్ : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు


పరకాల: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి: ప్రజా కవి కాళోజీ నారాయణరావు 109 జయంతిని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వివిధ గ్రామాలతో పాటు స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. కళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు జక్కుల అనిత రమేష్, మేకల స్వప్న, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎంపీడీఓలు భాస్కర్, సునిత, తహసీల్దార్ జగత్‌సింగ్, సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేష్, అప్పని పద్మ, కడారి రాజు, ఏపీఓ కుమారస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

పరకాల: తెలంగాణ యాస, భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు, తన కవిత ద్వారా ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను అన్నారు. పట్టణంలోని అమరధామంలో కాళోజీనారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, నాయకులు పసుల రమేష్, బండి సదానందం ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు శనిగరపు శ్రీనివాస్, బొచ్చు జేపీ పాల్గొన్నారు.

శాయంపేట : తెలంగాణ భాషను, యాసను అక్షరంలో పొందుపరిచి తన అక్షరాన్నే ఆయుధంగా మలిచి పోరాటం చేసిన గొప్ప యోధుడు కాళోజీ నారాయణరావు అని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో, మహాత్మ జ్యోతిభాపూలే బాలుర గురుకుల పాఠశాల, మాందారిపేట శివారులోని కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో శనివారం కాళోజీ జయంతిని వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాళ్లు రాజ్‌కుమార్, సుభాషిణిదేవి, స్పెషల్ ఆఫీసర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ మల్లయ్య, సతీష్, రవి పాల్గొన్నారు.

ఐనవోలు: ప్రజాకవి కాళోజీ జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే కొండపర్తి గ్రామంలో సర్పంచ్ కట్కూరి రాజమణి కాళోజీ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో కాళోజీ సేవలు మరువలేనివని కొనియాడారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడు కాళోజీ నారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ కుమారస్వామి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, బెన్‌సన్, బొక్కల నారాయణ, పులిగారి వెంకన్న పాల్గొన్నారు.

ధర్మసాగర్: ధర్మసాగర్, వేలేరు మండలాల్లో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా పెద్దపెండ్యాలలోని డీపీఎస్‌లో చైర్మన్ రవికిరణ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుమోల్ శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ధర్మసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, అధాపక బృందం, విద్యార్థులు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కళాప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా వేలేరు మండల కేంద్రంలో సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఉప సర్పంచ్ సద్దాంహుస్సేన్‌లు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

కమలాపూర్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు 109వ జయంతిని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకురాలు శోభాదేవి మాట్లాడుతూ వీర తెలంగాణ నాది అని నినాదించిన ప్రజాకవి కాళోజీ అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి, తెలుగు పట్ల, తెలంగాణ భాష పట్ల అంతులేని ప్రేమ కనబరిచిన యోధుడు కాళోజీ అని కొనియాడారు. జనం గోడుకు కాళోజీ కలం గొంతైందని, అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి, అన్యాయాన్ని ఎదురించిన వాడే నాకు ఆరాధ్యుడని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ధైర్యశాలి కాళోజీ నారాయణరావు అన్నారు. నిజాం పాలనను వ్యతిరేకించి, అందరిని ఏకం చేసిన పోరాట యోధుడు కాళోజీ నాయారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, అధ్యాపకులు కవిత, సాంబశివయ్య, సురేష్‌బాబు, రామదాసు, కుమారస్వామి, శ్రీనివాస్, సంధ్యారాణి, సిబ్బంది కొండయ్య, శ్రీనివాస్, కరుణ, శ్వేత పాల్గొన్నారు.

కేయూ జాక్ బంద్‌కు మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

శాయంపేట : ఈ నెల 12 వ తేదీన కేయూజాక్ పిలుపునిచ్చిన ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యాసంస్థల బంద్‌కు ఏబీఎస్ఎఫ్ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీహెచ్‌డీ కేటగిరి ఇంటర్వ్యూలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించిన విద్యార్థి నాయకులపై పోలీసులతో దాడి చేయడాన్ని నిరసిస్తూ కేయూజాక్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. పోలీసుల తీరు అమానుషమని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై లాఠీలు ఝుళిపించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై పోలీసులతో దాడి చేయించిన వీసీపై గవర్నర్ స్పందించి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మంటి విజయ్, విజ్ఞాన్, విష్ణు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు


లోలెవల్ వంతెనపై ఏర్పడిన గుంతులు

నడికూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో కంఠాత్మకూర్ లోలెవల్ వంతెనపై పెద్ద గుంతలు ఏర్పడి నీరు నిలించింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదలకు గురవుతున్నారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రారంభోత్సవం చేసినప్పటికీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టేంతవరకు సంబంధిత శాఖ అధికారులు తాత్కాలికంగా గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారించాలి పలువురు కోరుతున్నారు.

మండలం ఏర్పాటు చేయాలి


సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు తోట సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లో సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉప్పల్‌లో చేపట్టిన రైలురోకో ఎన్నటికీ మర్చిపోయేది కాదన్నారు. ఏకంగా ఢిల్లీని వణికించిందని సంఘటన అని గుర్తు చేశారు. నూతన మండలంగా ఏర్పాటు చేయడానికి ఉప్పల్‌కు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ఉప్పల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయడం కోసం భారతీయ జనతా పార్టీ తరఫున తాము సంపూర్ణ మద్దతు ఇస్తునట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉప్పల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, అందుకు ప్రణాళికలు సిద్ధం చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పోతిరెడ్డి నవీన్, బండి సంపత్, బండారి శ్రీనివాస్, తూర్పాటి భాస్కర్, వేముల సత్యం,చిట్టి సుందరయ్య, పిట్టల సతీష్, రాకేష్, ర్యాకం శ్రీనివాస్, కొండ తిరుపతి రాణాప్రతాప్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎన్ఎం రోసిలిన్

శాయంపేట : గర్భిణులు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఏఎన్ఎం రోసిలిన్ అన్నారు. జాతీయ పోషణమాసం సందర్భంగా శనివారం మండలంలోని జోగంపల్లి, నూర్జహాన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, తల్లులతో కలిసి ఆమె పోషణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వలన బిడ్డ ఎదుగుదల బాగుంటుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఆయాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'చల్లా' ఓటమి ఖాయం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పరకాల: స్థానికేతరుడైన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ విమర్శించారు. బీజేపీ మండల కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తానే రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి తెచ్చుకున్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో నరేంద్ర మోదీ పరిపాలనను ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. 9 ఏళ్ల కేసీఆర్ పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అన్ని విధాలుగా మోసపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యేలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అదే విధంగా నియోజకవర్గంలో టికెట్ ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ పార్టీ అధిష్టాన నిర్ణయం మేరకే నడుచుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్జుల సత్యనారయణరావు, కాచం గురుప్రసాద్, మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుక్కల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కన్నూరు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం


గురువులతో 2004-05 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు

కమలాపూర్: మండలంలోని కన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. సుమారు 18 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని తమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు తెచ్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సదానందం, కిషన్, స్వామి, రజాక్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, తమ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే సీట్లకు ఆశావహుల దరఖాస్తులు


ధర్మసాగర్ : దరఖాస్తు అందజేస్తున్న విజయరావు


ధర్మసాగర్ : దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి


హసన్‌పర్తి: దరఖాస్తు అందజేస్తున్న భరత్‌గౌడ్


పరకాల : దరఖాస్తు అందజేస్తున్న కాళీప్రసాద్‌రావు

పరకాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం బీజేపీ నుంచి పోటీ చేసేందుకు వైద్యుడు పగడాల కాళీప్రసాద్‌రావు దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి దరఖాస్తుఫారం అందించారు. బీజేపీ నుంచి పోటీలో ఉండేందుకు దరఖాస్తు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కాళీప్రసాద్‌రావుకు మద్దతుగా నిలువడం కొసమెరుపు.

ధర్మసాగర్: మండల కేంద్రానికి చెందిన చిలుక విజయరావు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతూ హైదరాబద్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ, జనగాం నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ నాయకులు గాజుల సంపత్ కుమార్, గంకిడి వెంకట్‌రెడ్డి, పూల శ్రీనివాస్, శ్రీరాముల విజయ్, దాసరి సదానందం ఉన్నారు.

హసన్‌పర్తి: హుస్నాబాద్ అసెంబ్లీ స్థానం కోసం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మతో కలిసి దరఖాస్తు ఫారంను అందించారు. హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కేశవాపూర్‌కు చెందిన ఆయన ఐపీఎస్ విద్యాసంస్థల డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు


బెల్టుషాపులను తనిఖీ చేస్తున్న ఎస్సై సౌమ్య

ఎల్కతుర్తి: గ్రామాల్లో కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌శాఖ ఎస్సై సౌమ్య హెచ్చరించారు. భీమదేవరపల్లి మండలంలోని ముస్తాఫాపూర్, కొత్తకొండ గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా కల్తీ మద్యం విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. బెల్టుషాపుల్లో అక్రమంగా మద్యం విక్రయించడంతో పాటు కల్తీ మద్యం తయారీ చేసి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఆమె తెలిపారు. కల్తీ మద్యం విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. దాడుల్లో సిబ్బంది ప్రవీణ్, వెంకటనారాయణ, చంద్‌పాషా ఉన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

ఖిలా వరంగల్: బ్రాహ్మణీయ, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడుదామని న్యూడెమోక్రసీ నాయకుడు ఆరెల్లి కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలరాజు పిలుపునిచ్చారు. మావో సంస్మరణ సభ సందర్భంగా వరంగల్ మధ్యకోటలో బండి కోటేశ్వర్‌రవు అధ్యక్షతన మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు 47వ వర్ధంతి సభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మావో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం తిరోగమణ దిశగా తీసుకెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్ణాశ్రమ ధర్మాన్ని, బ్రాహ్మణీయ హిందూ వ్యవస్థను కాపాడుతూ పార్లమెంట్‌ను ఉపయోగించుకుని రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామిక హక్కులపై దాడులు చేస్తోందని విమర్శించారు. దేశంలో లౌకికవాదులు ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పీడిత వర్గాలు కలిసి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎర్ర జయబాబు, ఇనుముల కృష్ణ, నారాయణ, కరుణాకర్, గద్దల ప్రభాకర్, ఏలియా, రాజు, హరిబాబు పాల్గొన్నారు.